## క్లుప్తంగా

### ఏప్రిల్ 2 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

**మేదరమెట్ల:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి పురస్కరించుకొని ఏప్రిల్ 2వ తేదీ నుంచి మేదరమెట్లలో జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తారని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్లు రూ.1000 ఎంట్రీ ఫీజును చెల్లించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు వరుసగా మొదటి బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.15 వేలు, నాలుగో బహుమతిగా రూ.10 వేలు నగదు బహుమతులను అందజేస్తారని తెలిపారు. వివరాలకు 91827 79423, 81069 17916 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

### విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

**చీరాల టౌన్:** మండలంలోని ఈపురుపాలెం పద్మనాభునిపేటలో నూతనంగా నిర్మాణం చేసిన నిత్య కల్యాణ సీతారామ మందిరం విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను గురువారం ప్రారంభించారు. అలానే ఈనెల 30న శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని దేవస్థాన కమిటీ ప్రతినిధులు సూచించారు. ఏప్రిల్ 3తేదీన మహాసమారాధనను నిర్వహిస్తున్నామని తెలిపారు.

### కల్నల్ జయకుమార్ సేవలు మరువలేనివి



క్యాడెట్లను అభినందిస్తున్న కమాండర్ జయకుమార్

**చీరాల టౌన్:** ఎన్‌సీసీ క్యాడెట్లకు ఉజ్వల భవితను అందించేలా కృషిచేసిన ఎన్‌సీసీ గుంటూరు గ్రూపు కమాండర్‌గా కల్నల్ జయకుమార్ సేవలు మరువలేనివని 23 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ ప్రశంసించారు. గురువారం చీరాలలోని 23 ఆంధ్రాబెటాలియన్ ఎన్‌సీసీ యూనిట్‌లో ఈనెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న గుంటూరు గ్రూప్ కమాండర్ కల్నల్ జయకుమార్‌ను బెటాలియన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కల్నల్‌కు క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు గౌరవ వందనం సమర్పించారు. ఎన్‌సీసీ ద్వారా వివిధ పోటీల్లో పతకాలు సాధించిన క్యాడెట్లను, అనంతరం గ్రూపు కమాండింగ్ ఆఫీసర్ జయకుమార్‌ను బెటాలియన్ తరపున సత్కరించారు. కార్యక్రమంలో బెటాలియన్ సూపరింటెండెంట్ సలీం, సుబేదార్ మేజర్ మేజర్ కృష్ణన్‌కుమార్, సుబేదార్ లక్ష్మణ్‌సింగ్‌నేగి, ఎన్‌సీసీ అధికారి ఎం.రాజేష్‌బాబు, క్యాడెట్లు, సిబ్బంది ఉన్నారు.

### ఏప్రిల్ 1న సర్వసభ్య సమావేశం

**మేదరమెట్ల:** కొరిశపాడు మండల సర్వసభ్య సమావేశం ఏప్రిల్ 1న ఉదయం 11గంటలకు నిర్వహిస్తారని ఎంపీడీవో సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు పాల్గొని తమ నివేదికలను సమర్పిస్తారని, సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని ఎంపీడీవో తెలిపారు.

### సచివాలయం తనిఖీ



సర్వేను పరిశీలిస్తున్న డీఎల్పీవో

**బల్లికురవ:** ప్రభుత్వం గ్రామాల్లోని పక్కా గృహాలు, నివేశన స్థలాలకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు చేపట్టిన స్వమిత్వ సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలని చీరాల డీఎల్పీవో, మండల ప్రత్యేకాధికారి కె. శ్రీనివాసరావు కోరారు. గురువారం వల్లాపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం బల్లికురవ సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ జీ. సీతామహాలక్ష్మి హెచ్ఎం బీ. భారతి, సెక్రటరీలు కె. ఆర్ ఖాన్, మోహన్‌రంగారావు పాల్గొన్నారు.

### ట్రిపుల్ రైడింగ్ చట్టరీత్యా నేరం

**అద్దంకి:** ట్రిపుల్ రైడింగ్ చేయటం చట్టరీత్యా నేరమని సీఐ రోశయ్య అన్నారు. గురువారం సాయంత్రం అద్దంకి పట్టణంలో ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న ద్విచక్రవాహన దారులను ఆపి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవటం, ద్విచక్రవాహనాలపై యువకులు ముగ్గురు ఎక్కి వెళ్లటం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థతో పారదర్శక పాలన

● శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య



కూకట్లపల్లిలో సమస్యలు తెలుసుకుంటున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

**బల్లికురవ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని కూకట్లపల్లి సచివాలయ పరిధిలోని యానాది సంఘంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్న తీరు సచివాలయ వలంటీర్ల పనితీరు తెలుసుకున్నారు. కాలనీకి రక్షిత పథక పైప్‌లైన్, కుళాయిలు, మీని ట్యాంకు పని చేయడంలేదని, వీధిలైట్లు సక్రమంగా వెలగటంలేదని కాలనీ వాసులు చైతన్య దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పాదర్శకంగా ఎలాంటి అవినీతికి తావులేకుండా నేరుగా అందుతున్నాయా అని ప్రశ్నించటంతో కాలనీ వాసులు పథకాలన్నీ తమకు సకాలంలోనే అందుతున్నాయని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో జగన్నను తిరిగి సీఎంను చేసేందుకు అండగా నిలవాలని చైతన్య కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ, మండల ఉపాధ్యక్షుడు ఐవీ సుబ్బారెడ్డి, సొసైటి అధ్యక్షుడు విప్పల అంజిరెడ్డి, స్థానిక నేతలు జాన్‌డీర్ సుబ్బారెడ్డి, టీవీ జయభాస్కరెడ్డి, విప్పల రామిరెడ్డి, గుంటక నాగిరెడ్డి, గోగులమూడి మల్లారెడి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురం పంచాయితీలో ఎనిమిది నెలల నుంచి మరమ్మతులకు నోచుకోని బోరు



తోటవారిపాలెం గ్రామంలో మూడు నెలల నుంచి పనిచేయని చేతిపంపు

# అధికారులూ ఇటు చూడరూ..

● గ్రామాల్లో మూలన చేరిన చేతిపంపులు

**చీరాల టౌన్:** వేసవి సమీపిస్తున్నా అధికారులు మొద్దునిద్ర వీడటం లేదు. వేసవిలో ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అధికారులు ఇంకా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులపై దృష్టి సారించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసిన పెద్ద చేతిపంపులు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీల్లో మంచినీటి కోసం గ్రామానికి 15 వరకు షాలో బోర్లను, ఇతర చేతిపంపులను ఏర్పాటు చేశారు. అయితే మంచినీటి కోసం ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఏర్పాటుచేసిన ఈ చేతిపంపుల్లో చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. చీరాల మండలంలో ఉన్న 150 షాలో బోర్లలో 60 బోర్లు ఆరు నెలల నుంచి మరమ్మతులకు నోచుకోలేకపోయాయి. ప్రధానంగా తీర ప్రాంత గ్రామాలైన దేవినూతల, కావూరివారిపాలెం, పిట్టువారిపాలెం, బుర్లవారిపాలెం, గవినివారిపాలెం, పచ్చమొగిలి, ఈపురుపాలెం, విజయలక్ష్మీపురం, కీర్తివారిపాలెం, తోటవారిపాలెం, వాడరేవు గ్రామ పంచాయితీలు, చీరాల పట్టణానికి చేరువగా ఉన్న రామకృష్ణాపురం, సాల్మన్‌సెంటర్, చీరాల నగర్, కొత్తపాలెం తదితర గ్రామాల్లోని చేతి పంపుల నుంచి మంచి నీరు రావడం కరువైంది. వేసవిలో ప్రజల దాహార్తికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వలనే సమస్య మరింత జఠిలంగా మారనుంది. ఇకనైనా అధికారులు స్పందించి వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా చేసి మూలనచేరిన చేతిపంపులను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఏమన్నారంటే..**

ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జ్ జేఈ కాలేషా వివరణ కోరగా మండలంలోని గ్రామాల్లో మరమ్మతుల్లో ఉన్న బోర్లను రిపేరు చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆయా పంచాయతీల్లో ఎన్ని మరమ్మత్తులకు గురైన పంపులు ఉన్నాయో గుర్తించి త్వరగా రిపేరు చేసేందుకు కృషి చేస్తాం. మండలంలోని అన్ని గ్రామాల్లో రిపేర్లలో ఉన్న చేతిపంపులు, బోర్లను కొద్దిరోజుల్లో బాగుచేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం.

# శనగల కొనుగోలు కేంద్రాలతో మేలు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సభ్యులు, నాయకులు

**పర్చూరు:** పర్చూరు మార్కెట్ యార్డు ఆవరణలో బోడవాడ పీఏసీఎస్ సొసైటీ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని బోడవాడ పీఏసీఎస్ ప్రెసిడెంట్ కామిశెట్టి వెంకటేశ్వర్లు గురువారం ప్రారంభించారు. ఈ సంవర్భంగా ఏడీఏ మోహనరావు మాట్లాడుతూ రైతులు శనగలను మద్దతు ధరకు అమ్ముకోవాలంటే కొన్ని నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. అలాగే తేమశాతం 14 శాతం, వ్యర్థాలు 1 శాతం, ఇతర ధాన్యగింజలు 3 శాతం, కల్తీ గింజలు 2 శాతం, దెబ్బతిన్న గింజలు 3 శాతం, రంగుమారిన, విరిగిన గింజలు 4 శాతం, ముతక గింజలు, పూర్తిగా తయారుకాని గింజలు 6 శాతం, పురుగుపట్టిన గింజలు 4 శాతం లోపు ఉండేటట్లు చూసుకోవాలని తెలిపారు. రైతు సోదరులు శనగలను తేమశాతం చూసకొని తెచ్చుకోవాలని తెలిపారు. ఒక క్వింటాలుకు శనగలు రూ.5335 లు ఇస్తారని తెలిపారు. ఈ శనగలను మార్క్‌ఫెడ్, నాఫెడ్ వారి ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కొనుగోలు చేసిన రైతుల ఖాతాలలో 10 రోజుల్లో డబ్బులు జమ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు సొసైటీ అధ్యక్షులు కుక్కపల్లి నాగేశ్వరరావు, పీడీసీసీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, సొసైటీ సీఈఓ కె.రత్నకుమారి, కమిటీ సభ్యులు ముప్పాళ్ల రాఘవయ్య, కోట శ్రీనివాసరావు, కొల్లా శ్రీహరి, రైతు సోదరులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

### గాలికుంటు వ్యాధి నివారణకు శిబిరాలు

**చీరాల అర్బన్:** నాలుగు నెలలు దాటిన దూడల నుంచి పశువులు అన్నింటికి గాలి కుంటు వ్యాధి రాకుండా జాతీయ పశువ్యాధి నిరోధక పథకంలో భాగంగా శుక్రవారం, శనివారం చీరాల డివిజన్ పరిధిలోని అన్నీ పశువైద్యశాలల్లో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని ఏడీఏ డాక్టర్ చిట్టిబాబు గురువారం తెలిపారు. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో ఉన్న పశుపోషకులు తమ దూడలు, పశువులకు గాలికుంటు రాకుండా టీకాలు వేయించాలని ఏడీఏ సూచించారు. అన్నీ గ్రామాల్లోని పశువైద్యశాలల్లో టీకాలను ఉచితంగా వేస్తున్నామని ఏడీఏ చెప్పారు.

### పేదల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● ఎంపీపీ వాసుబాబు



వాహనం అందిస్తున్న ఎంపీపీ వాసుబాబు

**కారంచేడు:** పేద ప్రజల సంక్షేమంతో పాటు, వారి ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం అహర్నిశలు కష్టపడి పనిచేస్తుందని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఆదిపూడి, కేశవరప్పాడు గ్రామాలకు చెందిన ముగ్గురికి 'జగనన్న బడుగు వికాసం' పథకం ద్వారా అందించే వాహనాలు అందించే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం బ్యాంక్‌ల సహకారంతో వాహనాలు అందించడం ద్వారా వారు స్వశక్తిగా సంపాదించుకొనే అవకాశం కలిగిస్తున్నామన్నారు. వాహనం ఆన్‌రోడ్‌లో 45 శాతం ప్రభుత్వం రాయితీ అందిస్తుండగా, మరో 45 శాతం బ్యాంక్ రుణం అందిస్తుందన్నారు. లబ్ధిదారులు కేవలం 10 శాతం పెట్టుబడితోనే ఒక సొంత వాహనం కలిగి ఉంటారన్నారు. మూడు వాహనాలను కారంచేడు ఎస్‌బీఐ ద్వారనే అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మధుసూదన రావు, ఎస్‌బీఐ మేనేజర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### విధులు సక్రమంగా నిర్వర్తించాలి

**అద్దంకి:** సచివాలయ ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించాలని అద్దంకి తహసీల్దార్ జీవి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నాగులపాడు సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రిజిస్టర్లను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు.

# పథకాలపై అవగాహన అవసరం



అధికారులతో మాట్లాడుతున్న పీడీ ప్రసాద్

**జే.పంగులూరు:** ప్రభుత్వ పథకాలపై ప్రతి అధికారి అవగాహన కలిగి ఉండాలని హౌసింగ్ పీడీ, మండల ప్రత్యేకాధికారి ప్రసాద్ అన్నారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకి, వెలుగు సిబ్బందికి, అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఏ శాఖకు సంబందించి ఆ శాఖ అధికారులు వారి ద్వారా ప్రజలకు అందే సేవలను పూర్తిగా తెలుసుకోవాలన్నారు. ప్రజలు సంబందిత సిబ్బంది వద్దకు వస్తే వారికి మాగు తెలియదు అని సమాధానం చెప్పకూడదన్నారు. కాని అధికారుల వద్ద నుంచి సరైన సమాధానం రాకపోవడంతో వారిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముందు తూర్పు కొప్పెరపాడు సచివాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శర్మ, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడి పనిచేస్తేనే తగిన గుర్తింపు



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా పౌర సంబంధాల అధికారి మోహన్‌రాజు



దైవాలరావూరులో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో

**చినగంజాం:** ఉద్యోగులు కష్టపడి పనిచేస్తేనే తగిన గుర్తింపు లభిస్తుందని జిల్లా పౌర సంబంధాల అధికారి టీ మోహన్‌రాజు సూచించారు. గురువారం ఆయన మండలంలోని చినగంజాం, మోటుపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించారు. చినగంజాం సచివాలయాన్ని ప్రభుత్వ పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రాలను హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు అందించే ఆహారాన్ని ఆయన పరిశీలించిన అనంతరం ఆయన పాఠశాల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**మేదరమెట్ల:** సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లుసర్వీసులను పెంచాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు.

# మతోన్మాద కోరల్లో నలిగిపోతున్న దేశం



భగత్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా సభ్యులు

**చీరాల రూరల్:** కార్పొరేట్ మతోన్మాద కోరల్లో నలిగిపోతున్న దేశానికి విముక్తి చేయటానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి పిలుపునిచ్చారు. గురువారం భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా స్థానిక పేరాలలోని సీఐటీయూ కార్యాలయంలో కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యం రావాలంటే బ్రిటీష్ వారు దేశం విడిచి వెళ్లిపోవాలని భగత్‌సింగ్ తన చిన్నతనంలోనే బ్రిటీష్ వారితో స్వాతంత్ర్యోద్యం చేసి వారితో పోరాడి అశువులుబాశారని గుర్తు చేశారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రభుత్వ భూములను వారికి అప్పనంగా అందజేస్తున్నదని ఆమె మంచిపడ్డారు. కార్యక్రమంలో ఐద్వా కార్యకర్తలు టి. సుభాషిణి, ఎస్. లక్ష్మి పాల్గొన్నారు.

# పోషకాహార లోపం సర్వే సక్రమంగా చేయాలి



చీరాల: సచివాలయాల ఉద్యోగులకు సూచనలందిస్తున్న కమిషనర్ ఐసయ్య



యద్దనపూడిలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్, సర్పంచ్

**చీరాల:** కలెక్టర్ ఆదేశాల మేరకు చీరాల మున్సిపాలిటీలోని 33 వార్డుల్లో 0–5 ఏళ్లలోపు వయస్సు ఉన్న చిన్నారుల్లో పోషకాహార లోపంతో బాధపడుతున్న వారి సర్వేను సక్రమంగా నిర్వహించి నివేదికలను అందించాలని మున్సిపల్ కమిషనర్ ఐసయ్య సూచించారు. గురువారం మున్సిపాలిటీలోని వార్డు సచివాలయాల వెల్ఫేర్ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఎడ్యుకేషన్ కార్యదర్శులు, వార్డు ఉమెన్ పోలీసులతో మండల్ కేర్ కమిటీని ఏర్పాటు చేసి సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘంలోని వార్డుల్లో పోషకాహార సర్వేలో భాగంగా ఇంటింటా సర్వే చేసి 5 ఏళ్లలోపు చిన్నారుల ఆరోగ్య స్థితి, బరువు తక్కువ, ఎత్తు తక్కువ వారిని గుర్తించి నివేదికలు అందించాలన్నారు. సమావేశంలో మున్సిపాలిటీలోని వార్డు సచివాలయాల ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఐసీడీఎస్ సిబ్బంది, మహిళా పోలీసులు ఉన్నారు.

**యద్దనపూడి:** అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందజేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ సూజాత అన్నారు. మండల కేంద్రం యద్దనపూడి బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హరికృష్ణ, దేవరాణి, హేమలత, ఆశలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

### దేవస్థానానికి సిమెంట్ బల్లలు అందజేత

**అద్దంకి రూరల్:** శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థాన ఆవరణలో భక్తులు సేదతీరేందుకు దేవస్థాన పాలక మండలి చైర్మన్ కోట శ్రీనివాసకుమార్ 9 సిమెంటు బల్లలను దేవాలయ సిబ్బందికి అందజేశారు. తన పదవీ విరమణ సందర్భంగా శ్రీనివాసరావు సొంత నిధులతో గడియారాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం అధ్యక్షుడు కుందుర్తి రాఘవరావు, అద్దంకి సీమబ్రాహ్మణ అధ్యక్షుడు జమ్మలమడక హనుమంతరావు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రంజాన్ ఉపవాస దీక్ష క్యాలెండర్ ఆవిష్కరణ



దీక్ష క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న ముస్లిం పెద్దలు

**మార్టూరు:** జిల్లా పరిధిలోని మార్టూరు మండల కేంద్రంలో రంజాన్ నెల ఉపవాస సమయ క్యాలెండర్‌ను ఆంధ్రప్రదేశ్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ జాఫర్ అలీ, ఉపాధ్యక్షుడు, బాపట్ల జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. రంజాన్ నెల ప్రారంభం కానున్న దృష్ట్యా ముస్లింలకు ఉపవాస సమయ పట్టిక క్యాలెండర్ ఎంతో అవసరం అని వారన్నారు. కార్యక్రమంలో జిల్లా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధికార ప్రతినిధి సయ్యద్ కరిముల్లా, మార్టూరు మండల యూత్ ప్రెసిడెంట్ గడ్డం అమిరుల్లా, టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాసిం బుడే, రఫీ, పసుమర్తి చిన్న, బుడే ఎంపీటీసీ కరిముల్లా, మసీద్ మౌసం కరిముల్లా ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



# ఉరుములు, మెరుపులతో వర్షం



యద్దనపూడి: పోలూరులో తడిసిన పొగాకు పందిళ్లు



బల్లికురవ: ఎస్టీ కాలనిలో చేరిన నీరు



మార్టూరు ఫ్లైఓవర్ కింద చేరిన నీరు

**బల్లికురవ:** మండలంలో గురువారం సాయంత్రం సుమారు 50 నిమిషాలపాటు ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై కొత్తపాలెం, నక్కబొక్కలపాడు, గుంటుపల్లి, చెన్నుపల్లి కొండాయపాలెం, మల్లాయపాలెం, కొప్పెరపాలెం, వేమవరం, కొణిదెన, గంగపాలెం గ్రామాల్లో కురిసిన వర్షానికి పొలాలు, లోతట్టు కాలనీలు పూర్తిగా జలమయం అయ్యాయి. ఉరుములు మెరుపుల దాటికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గుంటుపల్లిలో పడిన వర్షానికి మొక్కజొన్న నేలవాలింది.

**యద్దనపూడి/చినగంజాం:** మండలంలో సాయత్రం ఈదుర గాలులతో కూడిన కురిసిన వర్షంతో రైతులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఒక్కసారిగా అకాశం మేఘామృతమై పిడుగులతో పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో మొక్కజొన్న పంట నేలవాలింది. కల్లాల్లో ఆరపెట్టిన మిర్చి పై కప్పిన పట్టలపై నీరుచేరటంతో కొన్నిచోట్ల మిర్చి తడిచిపోయింది. అలాగే పందిళ్లపై ఉన్న పొగాకు తడిసి బరువెక్కి పందిళ్లు పడిపోయాయి. కొన్ని గ్రామాల్లో గాలులకు అక్కడక్కడ చెట్లు విరిగిపడ్డాయి. ఇదే విధంగా కొనసాగితే కల్లాల్లో ఉన్న మిర్చితో పాటు కోత దశలో ఉన్న పంట కూడా నాణ్యత దెబ్బ తింటుందని రైతులు వాపోతున్నారు.



గుంటుపల్లిలో నేలకొరిగిన మొక్కజొన్న